బైటికి పోలేక ఆక్రోశం!
సామర్థ్యం అదృష్టం లేకున్నప్పటికీ కూడాను
కారుల్లో యెక్కే సరదాయే!
కారుని కనిగే సరదా లేదు!—రాదు!
రోల్స్ రాయ్సులో షికారుపోయే సాయంత్రం

యెంతమాత్రం కాదిది!
కూలివాళ్లు పనికిపోయే
బిచ్చగాళ్లు ముష్టికిపోయే—శుభోదయం
అంతకంటె కాదిది!
ఇది యెండిన మొండి మధ్యాహ్నం!
మది యెండిన బండ మధ్యాహ్నం!
హృదిమండిన యెండు మధ్యాహ్నం!

స్కెచ్

# మత్కుణోపాఖ్యానం

డి. పార్వతి

చీకటిపడిందీ అంటే గుండె గుభేలుమంటోం దనుకోండి. మరేం జార-చోర భయంకాదు-రోగ భయంకాదు-దోమల బాధ! హుష్ అంతే కదా అని తోసేయకండి. ఆ బాధ పుందే-కురుపు సలిపిన దానికన్నా, ఒళ్లుకాలిన దానికన్నా, తేలుకుట్టిన దానికన్నాకూడ మహా చెడ్డది. కొట్టుకు కొట్టుకువచ్చి యింత కలోగంజో తాగి ఆదమరచి నిద్రపోదామంటే దరిద్రగొట్టు దోమలు శత్రువుల్లే తయారయాయి. కొందరు అంటారు "ఆ! నిద్రే పట్టాలిగాని దోమలో అడ్డమా?" అని. ముమ్మాటికీ అడ్డమేనని బల్లగుద్ది మరీ చెప్తాను. కుంభకర్ణుణ్ణి లేపటానికి ఏనుగులెక్కించి తొక్కించారనీ, పర్వతాలమించి దొర్లించారనీ ఏవేవో వంద చెప్తారు. అవన్నీ అనవసరాలనే నా నిశ్చితాభిప్రాయం. మన కలికాలపు దోమల్ని-ముఖ్యంగా తెనాలి, బందరు, ఏలూరు దోమల్ని ఆ గదిలోకి పంపితే కుంభకర్ణుడే కాదు వాడితల్లో జేజెమ్మకూడా బొబ్బలిడుతూ లేవాల్సిందే.

ఈ దోమలమీద ఒక పెద్ద "రిసెర్చి" చేసి డిగ్రీ సంపాదించాలనే దురభిప్రాయంతో కొంత పని చేసేను. ఆ రిసెర్చిలో కనుక్కొన్న కొన్ని ముఖ్య విషయాలు విన్నవిస్తాను. ఈ దోమలన్నీ పూర్వజన్మములో సంగీతగాయకులు-పాపం-వాళ్లు పాటకచ్చేరీలు చేస్తే జనం వినకుండా అవమానపరిచి ఉంటారు. వాళ్ళు "ప్లేబాక్" పాడితే రికార్డులు పగలకొట్టి ఉంటారు. అందుకని ఆ సంగీతగాళ్ళు మనమీద కసి తీర్చుకోడానికి ఈ దోమల రూపంలో యింటింటా, వాడవాడ, సందు సందునా మళ్ళా మాట్లాడితే ప్రపంచాన్నంతా ఆక్రమించి మనం వద్దు మొర్రో అన్నా, తిట్టినా, తిమ్మినా చివరకి చంపినా మనకి వాళ్ళ సంగీతం వినిపిస్తున్నారు. ఈ దోమలకి శ్రుతి జ్ఞానం మహావిశేషంగా ఉంటుంది. ఒకొక్క దోమ తెల్లవార్లూ ఒకే శ్రుతిలో ఒకే రాగం అలాపిస్తూ ఉంటుంది. ఒకొక్క దోమ స్వరం మందరస్థాయిలో ఉంటుంది. ఇంకోదోమ స్వరం తారస్థాయిలో ఉంటుంది. మూడు పాళ్ళు మందరస్థాయిలో పాడే దోమ మొగజాతిదై ఉండాలి. ఒకనాటి అర్థరాత్రి సమయంలో ఈ దోమ గాయకులు సమావేశమై తీర్మానాలు జారీ చేసుకున్నారు. అందులో ముఖ్యమైనవి యిహా ముందు గానకోకిల, నైటింగేల్ స్వర్ణకంఠ, యిట్లాంటి బిరుదులు కాక "దోమగాన" అని బిరుదులు యివ్వాలనీ, శ్రీయుత కీచురాయిగారు ఫిడేలు వాద్యము, నుసమశాస్త్రిగారి మృదంగముతో అఖిల ప్రపంచగాన సభలో పాటకచ్చేరీ చేయాలని! ఆ మహాతరుణం ఎప్పుడొస్తుందో ఏమో అందరూ ముందునించీ జాగ్రతగా ఉండండి. ఎందుకైనా మంచిది.

ఈ దోమలు మహా సరసులు, రసికులు, ఉదార స్వభావులు. వాటికి కమ్యూనిస్టు సిద్ధాం-

తం మహాబాగా వంటబట్టింది. గొప్ప బీద అన్న భేదాలులేవు. అందరి యిళ్ళకీ వెళ్తాయి. అందర్నీ ఆదరిస్తాయి. అవి మనుష్యుల రూపు భలే తొందరగా మారుస్తాయి. మేకప్ మనుష్యులు వీటిదగ్గర ఆ విద్య నేర్చుకోవాలిసిందే. చేతులు కాళ్ళు సన్నంగాఉన్నాయే అని ఎవరైనాచింతిస్తున్నట్లు తెలిస్తే దోమల్లో ఒక గొప్పింటివాళ్లు వెంటనే వారంరోజులలో కావలసినంత లావు ప్రసాదిస్తాయి దమ్మిడీఖర్చులేకుండా. మళ్ళాసన్నపడాలంటే మీతరం కాదుకదా పుట్టించిన బ్రహ్మతరం కూడ కాదు. వీటిల్లోనే యింకొక యింటివారున్నారు. పైవారికీ, వీరికీ ఏదోవైరం ఉన్నట్లుంది. ఇందాకటివి మనుష్యుల్ని ఏనుగలంత చేస్తే ఇవి పీనుగలంత చేస్తాయి. ఈ వర్గపు దోమ ఒక్కమాటు మనుష్యుణ్ణి ముద్దుపెట్టుకుందా: యిహ వాడు చచ్చేదాకా ఆముద్దు మహాత్మ్యాన్నిఅనుభవిస్తూఉండాల్సిందే. ఈ రెండుతరహాల దోమ పెద్ద మనుష్యులూ డాక్టర్లకు ఏజన్మనోఆప్తబంధువులు.

మనుష్యుల్ని ఏడిపించటంలో వీటికున్న సరదా ఇంకే క్రిమి కీటకాదులకు పశు పక్ష్యాదులకు ఉన్నట్లు నాకు తోచదు. మరీ వేసవికాలంలో చూడాలి వీటి వీరవిహారం. చలికాలంలో అయితే నఖశిఖ పర్యంతరం ముసుగుతన్ని పడుకుంటారు. కనుక వీటివల్ల అవస్థ అంతగా కనిపించదు. ఇహ వేసవికాలంలో ఏ కొద్ది మందికోతప్ప డాబాలు దోమతెరలు ఉండవుకదా. ఇంట్లో పడుకుంటే ఉక్కకి నిద్రే పట్టదు. ఏ అర్థరాత్రి సమయానో ఓ కునుకుపడితే గుంయ్‌మంటూ ఈ దోమలసంగీత మాయె. ఆ సంగీతాన్ని వినిపించుకోకుండా పడుకున్నామా "వినరేం?"అని చెంపకాయకొట్టినట్లు చురుక్కున పాడుస్తుంది. దాంతో పట్టే పట్టే నిద్దర కాస్తా ఆఖర్. దోమలబాధ పడలేక కప్పుకుందామా అంటే ఉక్క. మహాప్రభో! ఆ బాధ అనుభవ వేద్యమే కాని చెప్తే తెలిసేదికాదులే. చిగురాకువలె మృదువైన బుగ్గలనయినా దయా దాక్షిణ్యంలేక గజ్జికాకర కాయవలె చేస్తుంది. మానవ శరీరభాగాల్లో ముఖ్యంగా కాళ్ళు బుగ్గలు అంటే యివి పడి ఛస్తాయనుకోండి.

దోమతెరలున్నా ఊరుకుంటాయనుకున్నారేమో, అబ్బే! ఆమోహమాటం ఏంలేగు పాపం. దోమతెర చుట్టూరా లక్షలాది సమూహంచేరి, "ధిక్కారమును సైతునా?" అని మార్చింగు మొదలు పెట్టాయి. ఆ తర్వాత, "యిన్నాళ్ళ వలె కాదమ్మా" అని నిష్ఠూరాలు పలుకుతాయి. "నినువినా నామదెందు"అని తమ నిశ్చయాన్ని వెల్లడిచేస్తాయి. "ఇది న్యాయమా! వేచి ఉన్నానురా"అని విన్నవిస్తాయి. అప్పటికీ దోమతెర చిరుగు కనపడకపోతే, "తెర తీయగరాదా" అని జాలిగా విలపిస్తాయి. ఇంతలో ఒకటో అరో ఏదో ఒక విధాన లోపలికి జొరపడ్తాయి. ఇహ అవి ఆ పడుకున్న వ్యక్తిని ఖండిత నాయికమల్లే ఏడిపించి ఎర్రమన్ను చేస్తాయి. దోమతెర లేని వాడు తెల్లవార్లూ చప్పట్లు కొడుతూ భజన చేస్తాడు. రెండు చేతుల మధ్య కొన్ని దోమలైనా పడి చస్తాయని వాడి ఆశ. కాలుమీదో చేతిమీదో ఒక దోమ కనపడుతుంది. చంపుదామనే సదభిప్రాయంతో ఛళ్ళున పెడ్తాం. దాని తస్సాదియ్యా ఆ దోమ కాస్తా తప్పించుకుపోతుంది, మంటెత్తేలా మనకి దెబ్బ తగుల్తుంది! ఇదీ వరస. ఒకాయన నువ్వుల నూనె రాసుకు పడుకుంటే తగ్గుతాయని విని, రాత్రి నూనె ఒళ్ళంతా పట్టించుకుని పండుకున్నాడు. శరీరం, వేసుకున్న పరుపూ, అంతా నూనె వాసన, ఆ పైన ఒంటినిండా చీమలు పట్టాయి. పాపం దోమల బాధతో చీమల బాధ జత కల్పింది. ఇంకో విశేషం ఈ దోమలకి మహాగర్వం. సూక్ష్మజీవులమైన మమ్మల్ని సంహరించడానికి మానవులు హతమారి పోతున్నారని. నిజానికి యింత పెద్ద మనుష్యులం అంత చిన్నజీవాల్ని నాశనం చేయలేక పోతున్నామంటే అర్థముంది? వీటికి అఖిల జాతీయ మలేరియా సభలు, ఫైలేరియా సభలు, మందులు, మాకులు పరిశోధనాలయాలు. నోబెల్ ప్రైజులు ఏమిటో యింకా లక్షా; చూస్తే దో...మ. అదిగో చెవి దగ్గర ధర్మయుద్ధం సాగిస్తోంది నా మిత్రుడు దోమ. ఇహ దాన్ని పాటించకపోతే లాభంలేదు.

ప్రపంచాన్ని పాలకులు-పాలితులు అని రెండు వర్గాలుగా విభజించడంవల్ల నిరంకుశత్వంఓడిపోతుంది. అలా విభజించకపోవడంవల్ల ప్రజాస్వామ్యం ఓడిపోతుంది.